# తండ్రి గారి సందేశం....



## హృదయ పరివర్తనం చెందుడు

**"కాలము సంపూర్ణమైనది. దేవుని రాజ్యము సమీపించినది. హృదయ పరివర్తనము చెంది, సువార్తను విశ్వసింపుడు" (మార్కు 1,15)**

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

దైవరాజ్యములో ప్రవేశించాలంటే హృదయ పరివర్తనం చెంది సువార్తను విశ్వసించాలని యేసు ప్రభు పలుకుతున్నారు. హృదయ పరివర్తనం లేక మారు మనస్సు అంటే ఏమిటి? అని మనం ధ్యానిద్దాం.

పాత నిబంధనలో ఎక్కువగా ప్రవక్తలు ప్రజల నుండి కోరుకున్నది హృదయ పరివర్తనమే. బప్తిస్మమిచ్చు యోహాను హృదయ పరివర్తనం గురించి ప్రసంగించాడు. "పరలోక రాజ్యము సమీపించినది. మీరు హృదయ పరివర్తనం గురించి ప్రసంగించాడు. "పరలోక రాజ్యము సమీపించినది. మీరు హృదయ పరివర్తన చెందుడు" (మత్తయి 3,2) హృదయ పరివర్తనం అనే తెలుగు పదానికి గ్రీకు భాషలో ఉపయోగించిన పదం "మెతానోయితె" (Metanoete) ఈ గ్రీకు పదం "నూస్" (Nous) అనే పదం నుండి ఉద్భవించింది. ఈ పదానికి అర్థం 'మనస్సు'. అపుడు "మెతానోయితె" అనే పదానికి అర్థం మనస్సును మార్చుకోవడం లేక క్రొత్త మనస్సును పొందడం. తప్పు చేసి హృదయ పరివర్తనం పొందడం అంటే ఆ తప్పు నుండి దూరంగా తొలగిపోవడమే కాదు మంచిని చేయడం కూడా దానిలో భాగమే. హృదయ పరివర్తనం ఒక వ్యక్తిని సరికొత్త, మంచిదైన జీవన శైలిని పొందుకోవాలని ప్రేరేపిస్తుంది. మనం తప్పు దారిలో నడుస్తున్నామని తెలుసుకున్నట్లయితే, ఆ దారి నుండి ప్రక్కకు తొలగి మంచి దారిలో నడపడమే హృదయం పరివర్తన.

హృదయ పరివర్తనం అనే పదానికి హీబ్రూ భాషలో ఉపగించిన పదం "షుబ్" (Shub). హీబ్రు పదానికి అర్థం సొంత ఇంటికి తిరిగి రావడం. పాత నిబంధనలో ప్రవక్తలు "షుబ్" అనే ఈ పదం ఉపయోగించడం ద్వారా యిస్రాయేలు ప్రజలు తమ దేవుడైన యావే వద్దకు తిరిగి రావాలని కోరుకున్నారు. దేవుని ఆజ్ఞలకు వ్యతిరేకంగా జీవించి దేవునికి దూరమైన యిస్రాయేలు ప్రజలు తమ సొంత ఇంటికి అనగా దేవుని వద్దకు తిరిగి రావాలని ప్రవక్తలు బోధించారు. ఈ "తిరిగి రావడం" అనే పదంలో రెండు అర్థాలు ఉన్నాయి. మొదటిది, బాహ్యమైన తిరిగి రావడం. రెండవది, అంతర్గతమైన తిరిగి రావడం. బాహ్యమైన "తిరిగి రావడం"లో కన్నీరు కార్చడం, ఉపవాసం, బూడిదలో కూర్చోవడం, గోనె సంచి ధరించడం వంటివి ఉన్నాయి. అంతర్గతమైన "తిరిగి రావడం"లో "మెతానోయితె" అనే పదం నేర్పించే మనస్సు మార్చుకోవడం లేక సరికొత్త మనస్సును పొందడం ఉంది.

ఈ రెండు అర్థాలను యేసు ప్రభు తన ప్రసంగాల ద్వారా బోధించాడు. కానీ, రెండవ అర్థానికి

ఆయన అధిక ప్రాధాన్యం ఇచ్చాడు. బాహ్యమైన హృదయ పరివర్తనం (కన్నీరు కార్చడం, ఉపవాసం మొదలైనవి) అంతర్గతమైన పరివర్తనాన్ని ప్రతిసారీ ప్రతిఫలించ లేదు. అందుకనే బాహ్యమైన హృదయ పరవర్తన క్రియలను ఎక్కువగా ప్రోత్సహించడం లేదు. బప్తిస్మమిచ్చు యోహాను కూడా దీనినే బోధిస్తున్నాడు. సంపూర్ణమైన హృదయ పరివర్తనం అంటే పశ్చాత్తాపపడి ప్రభువు వద్దకు తిరిగి రావడం. దేవుడు మనలను ఎంతగానో ప్రేమిస్తున్నాడని తెలుసుకొని ఆ ప్రభువు ప్రేమ నుండి దూరంగా వెళ్ళామని గ్రహించడం హృదయ పరివర్తనలో మొదటి మెట్టు. హృదయ పరివర్తనం యొక్క లోతైన అర్థాన్ని యేసు ప్రభువు "తప్పిపోయిన గొఱ్ఱె", "పోగొట్టుకున్న నాణెం" మరియు "తప్పిపోయిన కుమారుడు" (లూకా 15) అనే ఉపమానాల ద్వారా వివరంగా బోధించాడు. తప్పిపోయిన కుమారుని కోసం ఎదురుచూస్తున్న తండ్రిలాగా మనం ఆయన వద్దకు తిరిగి రావాలని ఎదురు చూస్తున్నాడు.

దేవుని రాజ్యంలో ప్రవేశించాలంటే హృదయ పరివర్తనం తప్పని సరి అని యేసు బోధిస్తున్నాడు. అదే విధంగా సువార్తను విశ్వసించాలని ఆయన నేర్పిస్తున్నాడు. దేవుని వద్దకు తిరిగి రావాలంటే హృదయ పరివర్తనం చెంది సువార్తను విశ్వసించాలి.

హృదయ పరివర్తనం ఒక వ్యక్తి జీవితాన్ని సమూలంగా మార్చివేస్తుంది. దేవుని ప్రేమ కొరకు "సమస్తమును నష్టముగా" పరిగణించాడు పునీత పౌలుగారు (ఫిలిప్పీ 3,8). హృదయ పరివర్తనం ద్వారా ఒకరు "చిన్నబిడ్డల వలె" రూపొందింపబడుతారు (మత్తయి 18,3). అంతేకాక, సమస్తమును క్రీస్తు కొరకు త్యజిస్తారు (లూకా 14,33). క్లుప్తంగా, హృదయ పరివర్తనం మనలందరిని క్రీస్తునందు నూతన జీవితానికి నడిపిస్తుంది. ఈ క్రొత్త జీవితం మనం తీసుకునే ప్రతి నిర్ణయంలోను, మనం చేసే ప్రతి పనిలోను ప్రతిబింబిస్తుంది, ప్రతిబింబించాలి. హృదయ పరివర్తనం అంటే చీకటి నుండి వెలుగులోనికి, మరణం నుంచి జీవానికి, లోకం నుండి దేవుని వద్దకు చేసే ప్రయాణం. పునీత పౌలు గారి ప్రకారం హృదయ పరివర్తనం అంటే "నూతన సృష్టిగా" మారడం (2 కొరింతీ 5,17). ఒకరు క్రొత్త సృష్టిగా మారాలంటే అతడు "క్రీస్తు నందు" ఉండాలని పునీత పౌలుగారు మనకు నేర్పిస్తున్నారు 2 కొరింతీ 5,17). "మీ పూర్వ జీవితపు పాత స్వభావమును మార్చుకొనుడు. ఆ పూర్వపు జీవితము మోసకరమగు దుష్టవాంఛలచే భ్రష్టమైపోయినది. మీ మనస్తత్వమును నూతనత్వము గావించుకొనుడు. సత్యమైన నీతిని, పరిశుద్ధతను కలిగి దేవుని పోలికగా సృజింపబడిన క్రొత్త స్వభావమును ధరింపుడు" (ఎఫెసీ 4,22-24). ఈ విధమైన హృదయ పరివర్తనం ద్వారా మనం దేవుని రాజ్యంలో ప్రవేశించడానికి అర్హతను పొందుకుంటాము.

బాహ్యమైన హృదయ పరివర్తన క్రియలకు క్రైస్తవ విశ్వాస జీవితంలో విలువ ఉన్నప్పటికీ అంతర్గతమైన హృదయ పరివర్తనమే యేసుప్రభువు కోరుకునేది. యదార్థమైన పశ్చాత్తాపం లేకుండా ఉపవాసం ఉండడం వల్ల ఏమి లాభం? అందుకనే మారు మనస్సు పొంది మన తండ్రియైన దేవుని వద్దకు తిరిగి వద్దాం. ఆయన ప్రేమ నుండి దూరంగా వెళ్ళకుండా, ఆయన ప్రేమను అర్థం చేసుకొని ఆయన యందు జీవితాన్ని కొనసాగిద్దాం. దేవునికి తగిన బిడ్డలుగా ఈ లోకంలో జీవిద్దాం.

దేవుడు మనలందరిని దీవించును గాక! ఆమెన్.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి

**బిషప్ ప్రిన్స్ అంతోని**

ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు